మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



మూలే సరస్వతమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మేయర్ సురేష్ బాబు

మైదుకూరు : రాష్ట్రంలో మహిళలు సాధికారత సాధించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మైదుకూరులోని మిషన్ శక్తి సభ్యురాలిగా నియమితులైన మూలే సరస్వతమ్మ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వలేదన్నారు. పురుషులతో సమానంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఎక్కువ భాగం మహిళలకే కేటాయించారన్నారు. 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్లు ఇచ్చారన్నారు. కడప నగర మేయర్, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ అధ్యక్షుడు కె.సురేష్‌బాబు మాట్లాడుతూ 15 మంది ముఖ్య కార్యదర్శులు, సభ్యులుగా ఉన్న మిషన్ శక్తిలో మూలే సరస్వతమ్మ సభ్యురాలిగా నియామకం కావడం ఆమె శక్తి సామర్థ్యాలు, సేవా గుణాన్ని తెలియజేస్తున్నాయని తెలిపారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మహిళా కమిషన్ సభ్యురాలుగా ఉన్న సరస్వతమ్మను వైఎస్ జగన్ మిషన్ శక్తిలో సభ్యురాలిగా నియమించడం హర్షనీయమన్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ 50 శాతం మహిళలకు ఇచ్చి వారిని గౌరవించారన్నారు. మిషన్ శక్తి సభ్యురాలు మూలే సరస్వతమ్మ మాట్లాడుతూ మిషన్ శక్తిలో 80 శాతం మహిళలకే భాగస్వామ్యం కల్పించేలా కేంద్రం చర్యలు తీసుకుందన్నారు. అందులో తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. యోగివేమన యూనివర్సిటీ అధ్యాపకుడు మూల మల్లికార్జునరెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, అగ్రహారం సింగిల్ విండో చైర్మన్ రాఘవరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం మూలే సరస్వతమ్మను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, సురేష్‌బాబు తదితరులు సత్కరించారు. మైదుకూరు, బి.మఠం ఎంపీపీలు థామస్, సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, సింగ్‌విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు ర ఘురామిరెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, వైద్యులు మూలే రామఅనిల్‌కుమార్‌రెడ్డి, కిరణ్మయి, మూలే నాగిరెడ్డి, బొర్రా సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దువ్వూరు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నీలాపురం గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని, రైతులు పండించిన పంటలను మధ్య దళారులు లేకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు. సీఎం జగన్ అద్భుతమైన ఆలోచనతో రైతు భరోసా కేంద్రాలను నిర్మించారన్నారు. ఆర్‌బీకేలను కేంద్ర వ్యవసాయ శాఖ నిపుణులు ప్రశంసించారన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు అంటే వ్యవసాయం పండుగలా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు దేశంలో ఎక్కడాలేవని, వీటి ఏర్పాటుతో తమ కష్టాలు తీరాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం గ్రామంలో కొత్తగా నిర్మించిన సీతారామాలయం, అంకాలమ్మ, నల్లాలమ్మ దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రవ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకిబాషా, నాయకులు బి.వెంకటసుబ్బారెడ్డి, కె.వీరారెడ్డి, ఎం.రాజగోపాల్‌రెడ్డి, ఓబుళకొండారెడ్డి, సర్పంచ్ రామయ్య, ఎం.శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచీ టీ వరల్డ్ దుకాణంను శనివారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



మైదుకూరు : మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మైదుకూరు మండలం తువ్వపల్లె పంచాయతీ పరిధిలోని బసవాపురం, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, డీఎల్ నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని అన్నారు. బసవాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోకవర్గ సమన్వయకర్త, యువ నాయకుడు శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ముత్యాల ఎల్లారెడ్డి, వెంకటయ్య, రామశివారెడ్డి, సుబ్బిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పత్తూరు వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేష్టాది రవి, సింహం మల్లయ్య, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మధుసూదన్, గౌతమ్ కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్ల పాత్రే అత్యంత కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : పార్టీ కార్యక్రమాల్లో, సంక్షేమపథకాల అమలులో జగనన్న సచివాలయ కన్వీనర్ల పాత్ర ఎంతో ఉందని, జేసీఎస్ కన్వీనర్లు మరింతగా కృషి చేయాల్సి ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జేసీఎస్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డిలు తెలిపారు. శనివారం స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గస్థాయి జేసీఎస్ కన్వీనర్ల బీమా నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కన్వీనర్లు తమ పరిధిలోని కుటుంబాల గురించిన సమగ్ర సమాచారం తెలుసుకుని ఉండాలన్నారు. ఆ కుటుంబాలకు ఎన్ని ప్రభుత్వ పథకాలు అందాయో తెలిసి ఉండాలని, ఆ విషయం వారు ఆయా కుటుంబాలతో చర్చించాలన్నారు. లబ్ధిదారులకు కన్వీనర్లు ఎంత దగ్గరగా ఉంటే అంత ప్రయోజనం కలుగుతుందన్నారు. పార్టీలో కన్వీనర్లకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అన్ని పథకాలు ప్రజలకు అందాలన్నదే పార్టీ ధేయమన్నారు. జేసీఎస్ కన్వీనర్లకు భవిష్యత్ ప్రణాళికపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి, ఆదిత్యారెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, బి. కోడూరు మాజీ జెడ్పీటీసీ చౌదరి రామకృష్ణారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



పాయలకుంట్లలో ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తలిపారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాధవరాయునిపల్లె, పాయలకుంట్ల గ్రామాల్లో ఆమె ప్రభుత్వం నుంచి అందిన లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి తమ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, సర్పంచ్ నరసమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లయ్య, వెంకటరామయ్య, పెంచలయ్య, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రమణ, పంచాయతీ కార్యదర్శి మాబురెడ్డి, పలు శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన వార్డు ఎన్నికలు



డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న బడుగు శ్రావణి



డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న హర్షవర్ధన్‌రెడ్డి



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని 13వార్డుకు, తాళ్లమాపురం గ్రామ పంచాయతీలోని ఒకటో వార్డుకు సంబంధించి శనివారం ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. కొత్తపల్లె గ్రామ పంచాయతీ 13వ వార్డు స్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి 48 ఓట్లతో విజయం సాధించారు. 1172 ఓట్లకుగాను 942 ఓట్లు పోలయ్యాయి. ఏఎస్పీ ప్రేరణకుమార్ ప్రశాంతంగా పోలింగ్ జరిపించారు. ఇందులో కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి 479, పేరం బ్రహ్మానందరెడ్డికి 431, గురుస్వామికి 3, వసంత 8, జమాల్‌కు 2, నోటాకు 3 కాగా 16 చెల్లని ఓట్లు ఉన్నాయి. హర్షవర్ధన్‌రెడ్డి అధికారుల నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుని యానాది కాలనీలోని పోలింగ్ స్టేషన్ నుంచి ఊరేగింపుగా తరలి వెళ్లారు.

తాళ్లమాపురంలో గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో జరిగిన ఎన్నికల్లో పసుపుల లక్ష్మినారాయణమ్మ, బడుగు శ్రావణి పోటీ పడ్డారు. వార్డులో మొత్తం 318 ఓట్లు ఉన్నాయి. బడుగు శ్రావణికి 166 ఓట్లు రాగా, లక్ష్మీనారాయణమ్మకు 57 ఓట్లు వచ్చాయి. 109 ఓట్ల మెజారిటీతో బడుగు శ్రావణి విజయం సాధించారు.

ఈ విజయం వైఎస్ కుటుంబానికే అంకితం

ఈ విజయం వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికే అంకితమని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని 13వ వార్డు మెంబర్‌గా తన కుమారుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తొలి నుంచి తాను వైఎస్ కుటుంబానికి విధేయుడుగానే ఉంటున్నానన్నారు. తన విజయానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : రాజుపాళెంలో 9వ వార్డుకు సంబంధించిన ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 204 ఓట్లు కాగా, ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. పి.నాగయ్యకు 63, పి.ఓబులేసుకు 105, కె.లలితకు 1, నాలుగు చెల్లని ఓట్లు పడ్డాయి. ఎన్నికల సరళిని ఏఎస్పీ ప్రేరణకుమార్ పరిశీలించారు. డీఎస్పీ రమణయ్య, ఎస్‌ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

స్కూల్ గేమ్స్ కార్యాలయం ఏర్పాటు



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

మైదుకూరు : జిల్లా స్కూల్ గేమ్స్ కార్యాలయానికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఓ గదిని కేటాయిస్తామని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మైదుకూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం నిర్వహించిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మొదటి అంతస్తులో ఉన్న గదిలో స్కూల్ గేమ్స్ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఇంకా అవసరమైన వసతుల కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు తాను సిద్ధమని తెలిపారు. జిల్లా బాలికల జట్ల వెంట క్రీడా పోటీలకు మహిళా ఉపాధ్యాయులు తప్పకుండా వెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఎంపికలు ప్రత్యేకమైన కమిటీల ద్వారానే జరగాలన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని అందు కోసం ప్రతి వ్యాయామ ఉపాధ్యాయుడు క్రీడాకారులను సిద్ధం చేయాలని సూచించారు. డీఈఓ ఆదేశాలతో త్వరలోనే స్కూల్ గేమ్స్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి డీవీ కొండారెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కిరణ్, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ చెట్ల సాగుపై దృష్టి పెట్టాలి




మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

గోపవరం : సెంచురీ పానెల్స్ పరిశ్రమకు అవసరమయ్యే ముడిసరుకు (జామాయిల్ చెట్లు) సాగుపై రైతులు దృష్టి పెట్టాలని బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. శనివారం గోపవరం ఇండస్ట్రియల్ పార్క్‌లో జామాయిల్ చెట్ల పెంపకం-ఆవశ్యకత, లాభాలపై ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా వివిధ పంటలు సాగు చేసే భూములను మినహాయించి నీటి వసతి తక్కువ బీడు భూములుగా ఉన్న వాటిని జామాయిల్ సాగుకు ఎంచుకుని ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. 5 ఎకరాల నుంచి 50 ఎకరాల వరకు జామాయిల్ చెట్లు సాగు చేసుకునే అవకాశం ఉందని, ఇందుకోసం సబ్సిడీ ద్వారా పరిశ్రమ నిర్వాహకులే మొక్కలను రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎలాంటి రవాణా ఖర్చు లేకుండా పొలం వద్దకు మొక్కలను చేర్చే బాధ్యత కూడా పరిశ్రమ తీసుకుంటుందన్నారు. ముందుగా ఈ ప్రాంత రైతులకే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చిన ప్రాజెక్టుకాలనీ-1, 2 ప్రజలకు అన్నివిధాలుగా లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారికి కేటాయించిన భూముల్లో కూడా జామాయిల్ సాగు చేసుకోవచ్చన్నారు. ప్లాంట్ హెడ్, వైస్‌ప్రెసిడెంట్ సుశీల్, సుషాద్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి సంవత్సరం తిరిగేలోపే ఉత్పత్తిని బయటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకోసం ప్రతి రోజు 2 వేల టన్నుల ముడిసరుకు అవసరమవుతుందన్నారు. ఈ ఏడాది చివరిలో ఉత్పత్తి రన్ అవుతుందని, దీని ద్వారా ఎండీఎఫ్ బోర్డు, ల్యామినేట్స్, పీవీసీ బోర్డులు తయారు కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే పరిశ్రమకు భూములు ఇచ్చిన గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధి, అంబులెన్స్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న సెంచురీ పానెల్స్ ఇండియాలోనే అతి పెద్ద ప్లాంట్ అని చెప్పేందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడా చైర్మన్ గురుమోహన్, బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్ర కొనుగోలులో దళారీవ్యవస్థ ఉండదు

రైతులు సాగు చేసిన జామాయిల్ కర్ర కొనుగోలులో దళారీవ్యవస్థ ఉండదని నేరుగా పరిశ్రమ నిర్వాహకులు రైతుల వద్దకు వెళ్లి కర్రను కొనుగోలు చేస్తారని ఎలాంటి మోసాలు ఉండవని, ఎలక్ట్రానిక్ కాటా ద్వారానే కర్రను తీసుకుంటామని, టన్నుకు రూ.3200లు మద్దతు ధర ప్రకటించి రైతు నుంచి కొనుగోలు చేసి నేరుగా రైతు ఖాతాలోనే నగదు జమ చేస్తామని సెంచురీ పానెల్స్ జీఎం రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ముర్రుపాలతో బిడ్డకు ఎంతో మేలు



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఖాజీపేట : ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ అన్నారు. ఖాజీపేట బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంను ఆయన పర్యవేక్షించి విద్యార్థులకు అందే సదుపాలయాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లి పాలు తాపడం వల్ల పిల్లవానిలో అధిక వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన రోజు నుంచే పిల్లవానికి తల్లిపాలు ఇచ్చేలా చూడాలన్నారు. పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. అలాగే పుట్టిన ప్రతి బిడ్డకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మునీమ్, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి డాక్టర్ మునిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్ వైజర్ శోబన్‌బాబు, ఏఎన్‌ఎం సునీత, ఆశాకార్యకర్తలు పద్మావతి, రుబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పోరుమామిళ్ల : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి విద్యార్థి పనిచేయాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం కృష్ణశారద డిగ్రీ కళాశాలలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

21న వ్యక్తిత్వ వికాసం సదస్సు

ప్రొద్దుటూరు : పట్టణంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈనెల 21న స్థానిక వాసవి కల్యాణ మండపంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్నేహ సేవా సమితి అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెల్‌నంబర్ 9885339306కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వైభవంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

రాజుపాళెం : శ్రావణమాసంలో తొలి శనివారం కావడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయాల్లో శనివారం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో వైభవంగా ఊరేగించారు. సంజీవరాయస్వామి అన్నదాన సత్రంలో భక్తులకు భోజనం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాయిహర్షితకు అభినందనలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శనివారం డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వంకం సాయిహర్షితను ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అభినందించి ఘనంగా సత్కరించారు. సాయిహర్షిత తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, శారద, ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమల నివారణపై ర్యాలీ

చాపాడు : జాతీయ దోమల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని మడూరు గ్రామ పంచాయతీలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. దోమల భారి నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాలని, దోమల వలన డెంగీ, మలేరియా, డయేరియా వంటివి వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మహదేవ యాదవ్, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, ఏఎన్‌ఎం వనజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగోపాలస్వామికి ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో కొండగోపాలస్వామి

అట్లూరు : శ్రావణమాస మొదటి శనివారం కొండగోపాలస్వామి ఆలయం గోవింద నామస్మరణలతో మార్మోగింది. వేకువ జామునే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కూడా తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో ఆలయంకు చేరుకుని స్నానపు గుండంలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల మురళీ కుటుంబసమేతంగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఆస్పత్రి హోమియో వైద్యురాలు ఎస్.రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 128 మంది విద్యార్థులకు కళ్ల కలక రాకుండా ముందస్తు నివారణ మందులను పంపిణీ చేశారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల గ్రామం ఎస్సీకాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన రామాలయంలో సీతారామాంజనేయస్వాముల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట శనివారం వైభవంగా జరిగింది. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డిలు పూజలు నిర్వహించారు.

నాటుసారా ధ్వంసం

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె అడవుల్లో నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో శనివారం ఎస్‌ఐ హరిప్రసాద్, ఎస్‌బీ పోలీసులు అడవిలో గాలించి 500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. ముద్దాయిలు పారిపోయారని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం

బద్వేలు అర్బన్ : గ్రూప్-1 ఫలితాల్లో విజేతగా నిలిచి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన గోపవరం మండలం బ్రాహ్మణపల్లె పంచాయతీ ఓబులరెడ్డి నగర్ గ్రామానికి చెందిన పల్లం శ్రీనివాసులును శనివారం స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు కత్తివెంకటరమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు పీహెచ్‌సీ తనిఖీ

అట్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అదనపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి తనిఖీ చేసి టీబీ, లెప్రసీ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆశా కార్యకర్త, వలంటీర్ ఇంటింటికీ వెళ్ళి స్పర్శ లేని మచ్చలు, రెండు వారాల నుంచి దగ్గు వంటి వాటిని గుర్తించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ కె.హమీదబేగం, కమ్యూనిటీ హెల్త్ అధికారి సి.మురళీకృష్ణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే రాష్ట్ర మహాసభలకు సెలవు నిరాకరణ

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలకు దురుద్దేశంతోనే కామనూరు వైద్యాధికారి సెలవు మంజూరు చేయలేదని ప్రొద్దుటూరు తాలుకా యూనిట్ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. వైద్యాధికారి హనీఫ్ బాబా ఏపీ జీఈఏ తాలుకా ప్రెసిడెంట్‌గా ఉన్నందున ఈ మహాసభలు విజయవంతం కాకూడదనే దురుద్దేశంతో సెలవు మంజూరు చేయకుండా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.